క్లుప్తంగా

జీవీఆర్‌నగర్ మెయిన్ రోడ్డులో మార్కింగ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్యనగర్ దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు పనులు పూర్తికావటంతో గురువారం రోడ్డు మార్కింగ్ పెయింట్ వేశారు. ఇక్కడ రోడ్డు పనులు పూర్తయ్యినప్పటికీ స్పీడు బ్రేకర్‌లకు రోడ్డు మార్జిన్‌ల వద్ద పెయింట్ వేయకపోవటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మార్జిన్ పనులు పూర్తి చేసి మార్కింగ్ పనులు చేపట్టారు.

దుర్గమ్మకు కానుకగా వెండి ప్లేట్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు గురువారం వెండి ప్లేట్‌ను కానుకగా సమర్పించారు. విజయవాడ మారుతీనగర్‌కు చెందిన డి. సుదర్శన్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి సుమారు 995 గ్రాముల వెండితో తయారు చేయించిన ప్లేట్‌ను అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఏఈవో వెంకటరెడ్డి దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

రేపు ఆధ్యాత్మిక సంగీత కచేరి

విజయవాడ కల్చరల్: జ్ఞానదా కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 10 వ తేదీ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఎనిమిది గంటలపాటు ఆధ్యాత్మిక సంగీత కచేరి నిర్వహిస్తునట్లు నిర్వాహకులు హిమబిందు, పరచూరి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ 9 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులు, కళాకారులు పాల్గొంటారన్నారు.

దత్తసాయి మందిరంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు తం గెళ్ళమూడి వీరమోహనావు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దాత వరాలరావు సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 500 మంది భక్తులు బాబాను దర్శించుకుని బాబావారి ప్రసాదం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.

కుటుంబసభ్యులకు యువకుడి అప్పగింత



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పొట్టకూటి కోసం తన స్నేహితులతో కలిసి నగరానికి వచ్చి బ్లేడ్ బ్యాచ్ చేతిలోపడి నగదు, డబ్బు కోల్పోయి రోడ్డున పడ్డ జార్ఖండ్‌లోని హటియాకు చెందిన యువకుడు సందీప్‌ను గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య, తల్లిదండ్రులను పోషించేందుకు సొంతూళ్లో పనులు దొరక్కపోవడంతో స్నేహితులతో కలిసి రెండు వారాల కిందట సందీప్ విజయవాడ వచ్చాడు. గంజాయి బ్యాచ్ దాడి చేసి సందీప్ వద్ద ఉన్న ఫోను, డబ్బులు లాక్కోవడంతో రోడ్డునపడ్డాడు. సింగ్‌నగర్ ఫ్లైపులరోడ్డులో ఉన్న సందీప్‌ను గమనించి స్థానిక నాయకుడు దాసరి కనకారావు కడుపునిండా భోజనం పెట్టించి, వైద్యసాయం అందించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు ఫోను చేసి సమాచారం తెలిపారు. గురువారం సాయంత్రం సందీప్ కుటుంబసభ్యులు సింగ్‌నగర్ చేరుకున్నారు. సందీప్‌ను ఆదరించి తమకు అప్పగించడంపై కనకారావుతో పాటు స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు.

సందర్శకుల సందడి...



ఎగువ నుంచి ఉధృతంగా వస్తున్న వరద నీటి ప్రవాహంతో ప్రకాశం బ్యారేజీ జలకళ సంతరించుకుంది. భారీగా వచ్చిన వరద నీరు దిగువకు ప్రవహిస్తున్న తీరును చూసేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. ఆనందంతో సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





వ్యర్థాల నిర్వహణ కేంద్రం పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని రీసైకిల్, రీయూస్, రెడ్యూస్ (ఆర్‌ఆర్‌ఆర్) విజ్ఞాన కేంద్రం, గార్బేజ్ ట్రాన్సుర్ స్టేషన్ (ఎక్సెల్ ప్లాంట్)ను గురువారం ఆయన సందర్శించారు. ఆర్‌ఆర్‌ఆర్ విజ్ఞాన కేంద్రంలోని వ్యర్థ పదార్థాల నిర్వహణ సెంటర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో జరిగే వ్యర్థ పదార్థాల నిర్వహణ, వస్తువుల తయారీ పరిశీలించారు. ఎంఆర్‌ఎఫ్, కంపోస్ట్ ప్లాంట్‌లు, కొబ్బరి బోండాల వ్యర్థాల నుంచి తయారు చేస్తున్న ఎరువు, పరుపుల తయారీకి వినియోగించే కొబ్బరి పీచులు, కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోషన్ వ్యర్థాల నుంచి చేసే ప్లేయర్ బ్లాక్స్, పూల వ్యర్థాలతో చేసే అగరవత్తులు, ధూపాల పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రజలందరూ వ్యర్థాలను ఇంటి వద్దనే విభజించి కార్పొరేషన్ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. తద్వారా వ్యర్థాల నుంచి సంపద సృష్టించవచ్చని చెప్పారు. దీనికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కేవీ సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, వెంకటేశ్వరరెడ్డి, ఏఎస్ఎన్ ప్రసాద్, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

దాడి ఘటనలో నిందితుడికి జైలు

విజయవాడస్పోర్ట్స్: ఓ వ్యక్తిపై దాడి చేసిన మార్కపూడి కల్యాణ్‌కు ఐదు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ విజయవాడ ఒకటో అడిషనల్ చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరిముల్లా గురువారం తీర్పు చెప్పారు. నిందితుడు కల్యాణ్‌తో పాటు దాడి ఘటనలో పాల్గొన్న కాకర్లమూడి రాకేష్ తన తప్పు ఒప్పుకోవడంతో రూ. వెయ్యి జరిమానా విధించారు. బాధితుడిని ఇద్దరు నిందితులు అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేసిన ఘటనపై మాచవరం పోలీస్ స్టేషన్‌లో 2020 అక్టోబర్ ఆరో తేదీన కేసు నమోదయింది.

బీజేపీ హయాంలో దళితులపై దాడులు

మొగల్రాజపురం:దళితులపై అఘాయిత్యాలను నిరోధించడానికి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాటా సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. కేవీపీఎస్ దేశ వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా విజయవాడ నగరంలోని సున్నపుబట్టీల సెంటర్‌లో కేవీపీఎస్ నాయకులు గురువారం నిరసన తెలిపారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దళితులపై దాడులు, వివక్ష విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రకమైన దాడులు, వివక్షతను నివారణకు చర్యలు తీసుకోక పోగా ముద్దాయిలను కాపాడే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు.

బ్యారేజీ ఫుట్‌పాత్‌కు మరమ్మతులు





ప్రకాశం బ్యారేజీ ఫుట్‌పాత్ మరమ్మతులు గురువారం చేపట్టారు. ఎప్పటి నుంచో ఫుట్‌పాత్ అధ్వానంగా ఉంది. పాదచారులు నడవాలన్నా ఇబ్బందిగా మారింది. బ్యారేజీ రెయిలింగ్ సైతం ఒక వైపు వంగిపోయి అత్యంత ప్రమాదకరంగా తయారైంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించడంతో పాటు సందర్శకులు వస్తుంటారు. ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు అప్రమత్తమై పనులు చేపట్టారు. అదీగాక బుధవారం సీఎం చంద్రబాబు సైతం బ్యారేజీపై నిలబడి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు క్లాసుకు ముగ్గురు చొప్పున పేరెంట్స్ కమిటీ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నారు. ఇందులో పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా పొట్నూరు వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా గరికె లక్ష్మి, సభ్యులుగా ఎండీ ఆయేషా, కె.తవిటి నాయుడు, ఎస్. లలితమ్మ, లంకా సీత, ఎం.దుర్గా విశ్వేశ్వర్, టి. శ్రీనివాస్, సుంకర ప్రశాంతి, ఎ.శివకుమార్, కొల్లి ప్రభావతి, జి.శైలజ, జీర పద్మ, జి.భవాని సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికయిన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా పేరెంట్స్ కమిటీ ఎన్నిక

ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగర పాలక సంస్థ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఎన్నిక తూతూ మంత్రంగా జరిగింది. ఉదయం పూటే ఎన్నికలు పూర్తయ్యాయని చెప్పిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనీసం కమిటీ వివరాలు సైతం తెలియ చేయలేదు.

రసాభాసగా ఎస్ఎంసీ ఎన్నికలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):సత్యనారాయణపురంలోని ఏకేటీపీ స్కూల్‌లో 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)' ఎన్నికలు రాసాభాసగా సాగాయి. సుమారు 1500 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో హెచ్ ఎం శ్రీనివాస్ పర్యవేక్షణలో గురువారం ఎన్నికల పక్రియ జరిగింది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఇందులో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులతో 15 మంది సభ్యులతో ఎస్ఎంసీ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో పదో తరగతిలో జరుగుతన్న ఎన్నికల్లో గత చైర్మన్ శ్రీనివాసులు పోటీలో ఉండగా విద్యార్థుల తల్లిదండ్రులు మరో వ్యక్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనకు సభ్యుల సహకారం పూర్తిగా ఉన్నప్పటికీ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాల హెచ్ఎం ఎన్నికల్లో తన ప్రత్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారని ఆయనతో పాటు ఆయన వర్గం వాగ్వాదానికి దిగింది. దీంతో సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి పాఠశాలలో గందరగోళం సృష్టించారు. విషయం కాస్త విద్యాశాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో ఎంఈఓ వెంకటేశ్వరరావు పాఠశాలకు చేరుకుని దీనిపై దర్యాప్తు చేశారు. ప్రస్తుతానికి ఎన్నికలను తాత్కలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం తిరిగి ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటించనున్నట్లు తెలిసింది.

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

పాయకాపురం(విజయవాడరూరల్):స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్‌గా ఇ.సతీష్, వైస్ చైర్మన్ ఎం.ఇందిర ఎన్నికయ్యారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ పర్యవేక్షణలో ఎస్ఎంసీ కమిటీ ఎన్నిక జరిగింది. వీరితో పాటు 13 మంది సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు 6 గురు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీతో ప్రధానోపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికలో చైర్మన్‌గా కె.శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా బి.లతారెడ్డి ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రశాంతంగా ఎన్నిక జరిగింది. కుందావారి కండ్రిక బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలో చైర్మన్ షేక్ రజియాసుల్తాన, వైస్‌చైర్మన్ ఎల్.సూర్య నాగేశ్వరి ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ ఎన్నికలు నిర్వహించారు. రాజీవ్‌నగర్లోని ఎలిమెంటరీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా అన్నం కృష్ణకుమార్, వైస్ చైర్మన్‌గా బి.గౌరీభవానీ, కండ్రిక ఎలిమెంటరీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా కె.కరుణ, వైస్ చైర్మన్‌గా కిరణ్‌జ్యోతి ఎన్నికయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్య ఎలిమెంటరీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా షేక్ అషియా, వైస్ చైర్మన్‌గా పి.రవీంద్ర, చలసాని సూర్య ప్రకాశరావు ఎలిమెంటరీ స్కూల్ కమిటీ చైర్మన్‌గా కె.అనూష, వైస్ చైర్మన్‌గా జి.భవానీ ఎన్నికయ్యారు.



పేరెంట్స్ కమిటీ ఎన్నికలో సూచనలు చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ



ఏకేటీపీ స్కూల్‌లో వాగ్వాదానికి దిగిన రెండు వర్గాల ఎస్ఎంసీ సభ్యులు



నూతన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నేటితో ముగియనున్న ప్లాస్మా ఎగ్జిబిషన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్ (అణుశక్తి విభాగం), పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం సంయుక్తంగా సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న ప్లాస్మా ఎగ్జిబిషన్ శుక్రవారంతో ముగుస్తుంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్ నుంచి 24 ప్రాజెక్టు నమూనాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 5 తేదీ సోమవారం ప్రారంభమైన ఈ ప్రదర్శనలోని ప్రాజెక్టు నమూనాలను వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో విచ్చేసి పరిశీలించారు. ప్లాస్మా అంటే ఏమిటి, ప్లాస్మా వల్ల జరిగే ప్రయోజనాల గురించి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్‌కు చెందిన నిపుణులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రదర్శనలోని ప్రాజెక్టుల వివరాలను పుస్తకంలో నోట్ చేసుకుంటున్న విద్యార్థులు

స్వయం కృషితో ఉన్నత శిఖరాలు

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణ మూర్తి అన్నారు. బెజవాడ మ్యూజిక్ అకాడమీ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి గురువారం నిర్వహించారు. బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ గాయనీ గాయకులు సీనియర్ గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బెజవాడ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు జయరాజు సంస్థ లక్ష్యాలను వివరించారు. పరచూరి విజయలక్ష్మి, శ్యాంప్రసాద్, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు. ఉమా బలరాం, డేవిడ్‌రాజు, సయ్యద్ ఆలీ, భారతి, కృష్ణ సింధూ తదితరులు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం పాడిన సినీ గీతాలను ఆలపించారు.



మాట్లాడుతన్న బలరామ కృష్ణమూర్తి, వేదిక మీద ఉమాబలరాం, డేవిడ్‌రాజు తదితరులు

స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా వేగి త్రినాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన అసిస్టెంట్ కమిషనర్ వేగి త్రినాథ్ నియమితులయ్యారు. గాంధీనగర్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో గురువారం వేగి త్రినాథ్‌కు చీఫ్ కమిషనర్ రామగంగాధర్, హెడ్ క్వార్టర్ కమిషనర్ మానికొండ శ్రీధర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నియమ నిబంధనల ప్రకారం నడుచుకుంటానన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండేలా కృషి చేస్తానన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, స్నేహ భావం, నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేస్తానన్నారు.



వేగి త్రినాథ్‌కు నియామక పత్రం అందజేస్తున్న రామగంగాధర్, మానికొండ శ్రీధర్

ఆకట్టుకున్న ఆంధ్ర నాట్యం



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీకి చెందిన చిన్నారులు ప్రదర్శించిన ఆంధ్రనాట్యం భక్తులను ఆకట్టుకుంది. కళావేదికపై గురువారం సాయంత్రం చిన్నారులు ఆంధ్ర నాట్యాన్ని ప్రదర్శించారు. భక్తులు నాట్యాన్ని వీక్షించి ముగ్ధులయ్యారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నాట్యాన్ని ప్రదర్శించారు. అనంతరం శిష్య బృందానికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, అధికారులు ప్రసాదాలను అందించారు. – ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అభివృద్ధి పనులు దసరా నాటికి కొలిక్కి రావాలంటే తగినంత సిబ్బందిని నియమించాలని ఈవో కెఎస్.రామరావు ఆదేశించారు. దుర్గగుడి మహా మండపం ఎదుట నిర్మాణంలో ఉన్న అన్నదాన భవనం, ప్రసాదాల పోటు పనులను గురువారం ఈవో పరిశీలించారు. మహా మండపం ఎదుట ప్రసాదాల పోటు భవనం పనులు పిల్లర్ల స్థాయికి వచ్చాయని, దసరా నాటికి ఓ రూపానికి వస్తాయని ఇంజినీరింగ్ సిబ్బంది పేర్కొన్నారు. నిర్మాణ పనులకు ఎంత మంది కూలీలు వస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. దసరా నాటికి పనులు కొలిక్కి రావాలంటే ప్రస్తుతం ఉన్న కూలీల సంఖ్య మూడింతలు కావాలని, ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈవో వెంట దుర్గగుడి ఈఈ లింగం రమాదేవి, డీఈలు, ఎఈలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఈవో రామరావు, ఈఈ రమాదేవి

చోరీల నివారణపై ప్రజలకు అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్):నేరాల నియంత్రణకు ఈ పహారా, డయల్ 100, 112, ఎల్.హెచ్.ఎమ్.యస్ యాప్ పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని క్రైమ్ ఏడీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు తెలిపారు. చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గుణదల అపూర్వ అపార్ట్‌మెంట్‌లోని ప్రజలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ రకాల నేరాలు జరుగుతూ ఉంటాయని పేర్కొన్నారు. నేరాలు జరిగిన తరువాత దర్యాప్తు చేసేకంటే, అవి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం కోసం మంచిది అన్నారు. ప్రజలు ఎవరైనా ఊళ్ల వెళ్లే సమయంలో తప్పనిసరిగా లోకల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎల్.హెచ్.ఎమ్.యస్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. దీని వలన ఎవరైనా దొంగ ఇంట్లోకి వస్తే వెంటనే అలారం మోగడంతో పాటు సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం వస్తుందన్నారు. దీంతో దొంగలను పట్టుకోవచ్చని తెలిపారు. అపార్ట్‌మెంట్‌ల చుట్టూ లైటింగ్ పెంచుకోవాలని, సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఏవీవీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు, ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ